క్లుప్తంగా

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

శంషాబాద్‌ రూరల్‌: కొత్త 11 కేవీ లైన్‌ బైఫర్‌కేషన్‌ పనుల కారణంగా మంగళవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. శంకరాపురం గ్రామం, అగ్రికల్చర్‌ 11 కేవీ ఫీడర్లు, జిమ్స్‌, ఐఎంటీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ ఉండదన్నారు. శంకరాపురం, తొండుపల్లి ఇందిరమ్మ కాలనీ, భగీరథ కాలనీ, సుభాసన గ్రీన్‌, ఓంకార్‌ క్యారియర్స్‌, కనక్‌ ఫ్యాక్టరీ, ఐఎంటీ కళాశాల ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

మహాధర్నా పోస్టర్‌ ఆవిష్కరణ



అత్తాపూర్‌ పాఠశాలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

అత్తాపూర్‌: సీపీఎస్‌ రద్దు కోసం సెప్టెంబర్‌ 1వ తేదీన నిర్వహించనున్న మహాధర్నాను ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా పీఆర్‌టీయూ మాజీ అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పిలుపు మేరకు సెప్టెంబర్‌ 1వ తేదీన పెంచన్‌ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని పీఆర్‌టీయూటీఎస్‌ రాష్ట్ర శాఖ చేపట్టిన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు దగ్గర మహాధర్నాను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం రాజేంద్రనగర్‌ మండలంలోని అత్తాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. రాజేంద్రనగర్‌ మండలం పీఆర్‌టీయూ అధ్యక్షుడు సుదర్శన్‌, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్‌, రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్‌, మండల కార్యవర్గ సభ్యులు సత్తన్న, సీనియర్‌ నాయకులు విజయసాగర్‌, సాయిప్రసాద్‌రావు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌, సురేష్‌, ఉపాధ్యాయులు కమలమ్మ, రోజారాణి, పద్మావతి, హేమలత, అనిత, పీడీ రంగారెడ్డి పాల్గొన్నారు.

గండిపేట ఎంఈఓగా సునిల్‌కుమార్‌



సునిల్‌కుమార్‌

మణికొండ: గండిపేట మండల విద్యాశాఖాధికారిగా వట్టినాగులపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. సునిల్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. గతంలో ఎంఈఓగా పనిచేసిన విజయ్‌కుమార్‌ ఇటీవల పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నూతన ఎంఈఓగా సునిల్‌కుమార్‌ను నియమించటంతో ఆయన సోమవారం కిస్మత్‌పూర్‌లోని కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శివరాం, ప్రధాన కార్యదర్శి మధుకర్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

నార్సింగి ఇన్‌స్పెక్టర్‌ హరికృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్‌ హరికృష్ణారెడ్డి

మణికొండ: రాబోయే వినాయక చవితి పర్వదినాన్ని శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని నార్సింగి పోలీస్‌ ఇన్‌స్పెక్టర్‌ హరికృష్ణారెడ్డి సూచించారు. సోమవారం నార్సింగిలోని కేపీఎంఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో గణేష్‌ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ మాట్లాడుతూ... గణనాథుల విగ్రహాలను నెలకొల్పినప్పటి నుంచి నిమజ్జనానికి తరలించే వరకు నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయక మండపాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే విషయం తప్పనిసరి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్ని రోజులకు నిమజ్జనం చేస్తారు.. ఎక్కడ చేస్తారనే వివరాలను అందులో పొందుపరచాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతిమల వద్ద తగు భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. సీసీ కెమెరాలను తప్పనిసరి ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి సమయాల్లో తప్పనిసరి కొందరు అక్కడే నిద్రించాలన్నారు. శాంతి భద్రతల సమస్య రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్‌ఐలు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

బండ్లగూడ: తమ దృష్టికి వచ్చిన అన్ని సమస్యలనూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తామని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మాజీ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. 1వ డివిజన్‌లోని రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ, సీసీ రోడ్డు సమస్యలపై స్థానికులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఆయా సమస్యలను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామన్నారు. కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థలను ఆధునికీకరించిన తరువాత నూతన సీసీ రోడ్లు వేస్తామని తెలిపారు.

ఎప్పుడు కూలుతాయో..

శిథిలావస్థకు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహాలు

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం
- భయాందోళనలో నిరుపేదలు
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం



పీరంచెరువులో శిథిలావస్థకు చేరిన గృహ సముదాయాలు



గంధంగూడ ఫేస్‌ 1లో ఇలా...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి గంధంగూడ ఫేస్‌–1, బైరాగిగూడ వెళ్లే రహదారిలో ఫేస్‌–2, పీరంచెరువు ప్రాంతాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకంలో గృహ సముదాయాలను నిర్మించారు. ప్రస్తుతం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహాలు శిథిలావస్థకు చేరడంతో అందులో నివసిస్తున్న పేదలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

1,542 కుటుంబాలు...

కార్పొరేషన్‌ పరిధిలో గతంలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకంలో ఒక్కో బ్లాక్‌కు జీ ప్లస్‌ 3 పద్ధతిలో 1,542 ఇళ్లను గతంలోని ప్రభుత్వం నిర్మించి లబ్ధిదారులను గుర్తించి వారి కుటుంబాలకు ఇచ్చారు. గంధంగూడ ఫేస్‌–1లో 216, బైరాగిగూడ వెళ్లే రహదారి ఫేస్‌–2లో 486, పీరంచెరువు ప్రాంతాల్లో 840 గృహ సముదాయాలను జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకంలో నిర్మించి అందజేశారు. గృహాలు కట్టి 20 సంవత్సరాలు కాక ముందే కొన్ని బ్లాక్‌లు శిథిలావస్థకు చేరాయి. అందులో నివసిస్తున్న 1,542 కుటుంబాల వారు భయంభయంగా జీవనం సాగిస్తున్నారు.

నాణ్యత లోపం.. నిర్వహణ దైవాధీనం...

2006వ సంవత్సరంలో నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసిన తరువాత పేద ప్రజలకు అందజేశారు. ఒక్కో బ్లాక్‌కు జీ ప్లస్‌ 3 పద్ధతిలో నిర్మించిన హాల్‌, వంట గదులున్నాయి. 19 ఏళ్లు గడుస్తున్నా నిర్వహణ సరిగా లేకపోవడం, నిర్మించేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించనందునే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఉన్న గోడలన్నీ వర్షాలు పడినపుడు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయంటున్నారు. ప్రస్తుతం దాదాపు అన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీసం మరమ్మతులు చేయించుకోలేని స్థితిలో కొందరు పేదలు ఉన్నారు. దీనిపై అధికారులు స్పందించడం లేదని వారు వాపోతున్నారు.



గంధంగూడ ఫేస్‌–2లో పెచ్చులు ఊడిన గోడలు

పెచ్చులూడి పడుతున్న స్లాబులు...

గతంలో కూడా గంధంగూడ ఫేస్‌–1 లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో ఇల్లు కూలడంతో ఓ వ్యక్తి తలకు తగిలి తీవ్ర గాయాలకు గురయ్యాడు. పలు మార్లు నాయకులతో కలిసి అక్కడి ప్రజలు శిథిలావస్థకు చేరిన గృహాలను గుర్తించి త్వరితగతిన మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. గృహాలు శిథిలావస్థకు చేరడంతో వర్షం కురిస్తే స్లాబ్‌ల నుంచి నీరు కిందికి చేరుతుండడం, స్లాబ్‌ పెచ్చులు ఊడి కింద పడుతుండటంతో అందులో నివాసం ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి భవనాలకు మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని నివాసితులు కోరుతున్నారు.

అండర్‌పాస్‌ను ముంచెత్తిన వరద

- నిలిచిపోయిన వాహనాల రాకపోకలు



ఔటర్‌ అండర్‌పాస్‌లో నిలిచిన వరదనీరు

శంషాబాద్‌ రూరల్‌: మున్సిపాలిటీ పరిధిలోని సంఘీగూడ–చిన్నగోల్కొండ మార్గంలో ఔటర్‌ రింగు రోడ్డు అండర్‌పాస్‌లో వరదనీరు నిలిచింది. సోమవారం కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వచ్చి ఇక్కడ చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు ఆరు అడుగుల మేర వరద చేరింది. సంఘీగూడ చౌరస్తా నుంచి పాల్మాకులలో ఉన్న బెంగళూరు జాతీయ రహదారిని అనుసంధానం చేసే పీ–వన్‌ మార్గంలో వచ్చే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమీపంలోని గ్రామాల ప్రజలు దూరం నుంచి వెళ్లాల్సి వస్తుంది. ప్రతి ఏటా వర్షాకాలంలో వరదనీరు నిలిచి ఇబ్బందులు ఎదురవుతున్నా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరిస్తాం



డ్రీమ్‌ వ్యాలీ ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌, అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఉన్నప్పుడే ప్రజా సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అవుతాయని బీజేపీ పార్టీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడి అన్నారు. గగన్‌ పహాడ్‌ డ్రీమ్‌ వ్యాలీ పరిసర ప్రాంతాల్లో నూతన భూగర్భ డ్రైనేజీ, నూతన సీసీ రోడ్డు కోసం జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... త్వరితగతిన అభివృద్ధి పనుల కోసం నూతన వాటర్‌ పైపులైన్లు, నూతన మంజూరు కోసం ఎస్టిమేషన్‌ ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా పై అధికారులతో మాట్లాడి పనులను ముందుకు సాగే విధంగా కృషి చేస్తామని బస్తీ వాసులకు ఆయన హామీ ఇచ్చారు. నేతలు జోగి రవి, తలారి చిన్న, వల్లూరు శ్రీనివాస్‌, పుస్తకాల నందు, టి.అజయ్‌కుమార్‌, జె.ఎం.శ్రీనివాస్‌, టి.పవన్‌, బబ్లూ, ఎన్ను శంకర్‌రెడ్డి, జలమండలి మేనేజర్‌ ప్రసాద్‌, జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాహుల్‌, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు



మల్కారంలో కౌన్సిలింగ్‌ కేంద్రాలను ప్రారంభిస్తున్న దృశ్యం



రామంజాపూర్‌లో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

శంషాబాద్‌ రూరల్‌: ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని మల్కారంలో సోమవారం వివిధ అంశాల కౌన్సిలింగ్‌ కేంద్రాలను ప్రారంభించారు. గత 45 రోజులుగా గ్రామంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మానవ అభివృద్ధి, కుటుంబ అధ్యయన విభాగానికి మనోవికాస కేంద్రం, వనరుల నిర్వహణ, వినియోగదారుల శాఖలో వినియోగదారుల సమాచారం కేంద్రంతో పాటు విస్తరణ విద్య, సమాచార నిర్వహణ శాఖలో సమాచారం కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆహార.. పోషక శాఖలో ఆహార సలహా కేంద్రాన్ని ప్రారంభించారు.

రామంజాపూర్‌లో...

సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రామంజాపూర్‌లో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్య, పిల్లల పెంపకం, కుటుంబ విలువలపై అవగాహన కల్పించారు. కన్యాభ్రూణ హత్యపై వినూత్నంగా నాటిక ప్రదర్శన చేశారు. మహిళలకు ఎంబ్రాయిడరీ, హస్తకళలు, ఆభరణాల తయారీపై శిక్షణతో ఉపాధి అవకాశాలు పెంపొందించుకునేలా ప్రోత్సాహం అందించారు.

నేడు 1104 యూనియన్‌ సర్వసభ్య సమావేశం

రాజేంద్రనగర్‌: తెలంగాణ విద్యుత్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ 1104 రాజేంద్రనగర్‌ సర్కిల్‌ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు డివిజన్‌ కార్యదర్శి హాజీ తెలిపారు. శివరాంపల్లిలోని కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని షాద్‌నగర్‌, కందుకూరు, రాజేంద్రనగర్‌ సర్కిల్‌ యూనిట్‌లలో విధులు నిర్వహిస్తున్న ఎంఆర్‌టీ డివిజన్‌ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్మికులందరూ హాజరు కావాలన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు డైరీఫామ్‌ చౌరస్తాలోని రాయల్‌ హయత్‌ కన్వెన్షన్‌లో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్‌: అత్తాపూర్‌ డివిజన్‌ రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మొండ్ర నర్సింహ, ఆలయ పూజారి వెంకటేష్‌ పంతులు ఆధ్వర్యంలో శ్రావణమాసం ఆఖరి సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం గణపతి పూజ, పరమశివునికి అభిషేకం, ఉమామహేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన తదుపరి రుద్ర హోమం, నవగ్రహాల పూజలు, ఆంజనేయ స్వామికి పూజలు పూర్ణాహుతి తరువాత అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన రుద్ర హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో పుస్తకాల అశోక్‌, ఎస్‌.బి.హరినాథ్‌, బర్ల మల్లారెడ్డి, కొండమీది హరినాథ్‌, నారగూడెం మల్లారెడ్డి, మ్యాడం రామేశ్వరరావు, మ్యాడం మధుసూదన్‌, మొండ్ర అయిలయ్య, చెట్టిగారి చిన్న, ఎం.బాలు, ఎస్‌.జయానంద్‌ రెడ్డి, యూ.శ్రీకాంత్‌, మ్యాడం రాము, హోమంలో పాల్గొన్న దంపతులు పెంటల బబిత సుధాకర్‌రెడ్డి, సాబాద స్వప్న విజయ్‌కుమార్‌, కాకులారం రాణికృష్ణ, ఎస్‌.బి.శ్రీనాథ్‌, ఎస్‌.అశోక్‌, సులిగే మల్లేష్‌, కె.కిరణ్‌చారి, సత్యనారాయణ, ఎల్‌.వెంకటేష్‌, గొరిగె రాజు, రావుల భాస్కర్‌, శెట్టిగారి శేఖర్‌, కైలా రవీందర్‌రెడ్డి, జి.సురేందర్‌రెడ్డి, జి.బల్వంత్‌రెడ్డి, పుస్తకాల శేకర్‌, రమేష్‌, కె.రాజు, సంతోష్‌, రఘునందన్‌, శ్రీకాంత్‌, సులిగే రమేష్‌, సులిగే శ్రీనివాస్‌, ఇంద్రారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న భిక్షపతి

శంషాబాద్‌ రూరల్‌: మండల పరిధిలోని కేబీ దొడ్డి–రాయన్నగూడ రోడ్డు విస్తరణ పనులను పూర్తి అయ్యేలా చూడాలని స్థానిక నేతలు సోమవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌కు విన్నవించారు. సుమారు కిలోమీటరు దూరం వరకు విస్తరణ పనులు ఆగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డుపై గుంతలు పడటంతో పాటు వరదనీరు నిలిచి రాకపోకలు సాగించడానికి కష్టంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పోచమ్మ తల్లి



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలో పోచమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలు, మామిడిఆకులు, విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా గాజులతో అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

స్ఫూర్తి ప్రదాత సర్వాయి పాపన్నగౌడ్‌



కిస్మత్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న శాసన మండలి మాజీ చైర్మన్‌ స్వామిగౌడ్‌ తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో ఘనంగా సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్‌ స్వామిగౌడ్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్వామిగౌడ్‌ మాట్లాడుతూ... పాపన్న సామాన్య కుటుంబంలో పుట్టి చరిత్ర సృష్టించిన బహుజన వీరుడని కొనియాడారు. నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించిన అలుపెరగని పోరాట యోధుడన్నారు. భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా అసమాన పోరు చేసిన ధీరుడని కొనియాడారు. ప్రజల ఆత్మ గౌరవాన్ని ఎలుగెత్తి చాటుతూ, సామాజిక న్యాయాన్ని అమలు చేసిన సమరసేనాని, తొలి బహుజన చక్రవర్తి సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ అని అన్నారు. కార్పొరేషన్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షుడు నాగరాజు, నేతలు గోకరి సురేష్‌గౌడ్‌, శేఖర్‌ముదిరాజ్‌, సంగారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్‌, సదానంద్‌ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగోల్కొండలో..

శంషాబాద్‌ రూరల్‌: పెద్దగోల్కొండలో సోమవారం సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ జయంతిని నిర్వహించారు. నార్సింగ్‌ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ శ్రీకాంత్‌గౌడ్‌ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాపన్న సేవలను కొనియాడారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పాపన్నకు నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌గౌడ్‌

పరిశుభ్రతపై బాధ్యతగా ఉండాలి



దుర్గానగర్‌ చౌరస్తాలో పర్యటిస్తున్న రాజేంద్రనగర్‌ డీసీ సురేందర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు బాధ్యతాయుతంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ దుర్గానగర్‌లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు చెత్తాచెదారాలను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదని సూచించారు. నిత్యం ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రోడ్లపై వరద నీరు నిలిచి ఉండకుండా మాన్‌సూన్‌ సిబ్బంది ఎప్పటికప్పుడు స్పెషల్‌ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. గోతులమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముగిసిన వెండికొండ జాతర



పూజల్లో పంచాయతీ రాజ్‌ రాష్ట్ర సంఘటన్‌ చైర్మన్‌ రాచమల్ల సిద్దేశ్వర్‌

శంషాబాద్‌: మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన వెండికొండ సిద్ధేశ్వర్‌ (సిద్దులగుట్ట జాతర) సోమవారం ముగిసింది. చివరి రోజు సోమవారం భక్తులు వేల సంఖ్యలో హాజరై పాలరాతి కొండపై కొలువు దీరిన త్రినేత్రుడిని దర్శించుకున్నారు. పాలాభిషేకం, రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేత కార్తీక్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్‌ సంఘటన్‌ రాష్ట్ర చైర్మన్‌ రాచమల్ల సిద్దేశ్వర్‌ తదితరులు జంగమయ్యను దర్శించుకున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై సత్వర స్పందన



సురేందర్‌రెడ్డి, డీసీ

రాజేంద్రనగర్‌: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సమస్య సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ సురేందర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కిల్‌ పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్‌ మాట్లాడుతూ... ప్రతి సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామరు. ప్రతి ఫిర్యాదునూ రిజిస్టర్‌లో పొందుపరిచి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు తమ పరిశీలనలో ఉంటుందన్నారు.

గణేశ్‌ మండపాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- నిబంధనలను తప్పక పాటించాలి
- డీజేలకు అనుమతిలేదు
- అతిక్రమిస్తే చర్యలు తథ్యం
- అడిషనల్‌ డీసీపీ శ్రీనివాస్‌



మాట్లాడుతున్న అడిషనల్‌ డీసీపీ శ్రీనివాస్‌

మైలార్‌దేవ్‌పల్లి: గణేశ్‌ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మండపాల నిర్వాహకులు నిబంధనలను తప్పనసరిగా పాటించాలని అడిషనల్‌ డీసీపీ కె.శ్రీనివాస్‌ స్పష్టం చేశారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌ ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో గణేశ్‌ మండపాల నిర్వాహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అడిషనల్‌ డీసీపీ శ్రీనివాస్‌, ఏసీపీ శ్రీనివాస్‌ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండపాల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

అందరూ అనుమతులు తీసుకొనే మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. డీజేలను పూర్తిగా నిషేధించామని... వాటి వినియోగానికి ఎలాంటి అనుమతులు ఉండవన్నారు. ఎవరైనా నిబంధనలు పాటించకపోతే వారిపై చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.